క్లుప్తంగా

ఘనంగా షిర్డిసాయిబాబా ఆలయ వార్షికోత్సవం



స్వామికి పాలాభిషేకం చేస్తున్న భక్తుల

మదనపల్లె సిటీ : స్థానిక కోటవీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయ 18 వ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులే స్వయంగా స్వామిని పాలాభిషేకం చేశారు. స్వామికి విశేష పూజలు, లోక కళ్యాణార్థం సద్గురు దత్త హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సాయిచక్రవర్తి, రెడ్డప్పరావు, సాయిసన్నిధి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా టాపర్‌కు మెమెంటో అందజేసిన కలెక్టర్



జిల్లా టాపర్‌కు మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

పెద్దతిప్పసముద్రం : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పీటీఎం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కే.లిఖిత్ కుమార్ రెడ్డి 585 మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానం సాధించాడు. ఏ ప్రభుత్వ పాఠశాలలో సాధించలేనంతగా అన్నమయ్య జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిన టాపర్‌కు గురువారం రాయచోటిలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అభినందించి మెమెంటో అందజేసినట్లు ఎంఈఓ నారాయణ, హెచ్‌ఎం శంకరయ్య తెలిపారు.

14న శ్రీరామకోటి మహాయజ్ఞం

వాల్మీకిపురం : మండలంలోని పాతమంచూరులో వెలసిన శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 14న శ్రీరామకోటి మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పూజారి రామక్రిష్ణ తెలిపారు. ఆదివారం ఉదయం 5గంటలకు మహాగణపతి, సీతారామలక్ష్మణలకు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 7గంటలకు ఆకాశదీపం, జ్వాలా తోరణం, సహస్రదీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పూజారి కోరారు.

ప్రతిభ విద్యార్థులకు అభినందనలు

పెద్దతిప్పసముద్రం: కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షలు రాసి ప్రతిభ చాటిన విద్యార్థులను గురువారం ప్రజా ప్రతినిధులు అభినందించారు. 547 మార్కులతో ఎస్.మిస్బా, 545 మార్కులతో నిష్రా, 540 మార్కులు సాధించిన ధనుష్‌లను జెడ్పీటీసీ శివన్న, ఎంపీటీసీ కేశవ్, సర్పంచ్ రహ్మతుల్లా, స్కూల్ కమిటీ చైర్మన్ బడ్డాబాబు స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లయ్య, సీఆర్‌పీ నాగరాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్ట వద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో దివ్యాంగులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ ఇవ్వనున్నట్లు వెలుగు పాఠశాల కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. 15 సంవత్సరాలుపైబడిన దివ్యాంగులకు చేతితో అగర్‌బత్తీల తయారీ, జూనియర్ డేటా అసోసియేట్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, సీవింగ్ మిషన్‌ల నందు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు 7799996609, 7799499333, 8074711472 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గట్టులో భూముల రీసర్వే ప్రారంభం

బి.కొత్తకోట : మండలంలోని గట్టు గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. డ్రోన్ ద్వారా చేపట్టిన సర్వేను రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. గ్రామంలో ప్రభుత్వ, పట్టా భూములను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి వివాదాలు, సమస్యలను పరిష్కరించి రైతులకు శాశ్వత హక్కులను కల్పించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

నేడు నిమ్మనపల్లెలో ఎమ్మెల్యే పర్యటన

నిమ్మనపల్లె : నిమ్మనపల్లెలో ఎమ్మెల్యే నవాజ్ బాషా శుక్రవారం పర్యటించనున్నట్లు ఎంపీడీవో లీలామాధవి, వెలుగు ఏపీఎం రజనీ కుమారి తెలిపారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు జిల్లా పరిషత్ హైస్కూల్ (తెలుగు)లో డ్వాక్రా మహిళలతో వైఎస్సార్ ఆసరా సమావేశంలో పాల్గొని చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలు వెలుగు సంఘమిత్రలు, సీసీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- 35వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 35వవార్డులో కౌన్సిలర్ ఎస్వీ.రమణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ మనూజారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యే ప్రజలను అప్యాయంగా పలుకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..లేదా అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పలువురు ఇళ్ల పట్టాలు మంజూరైనప్పటికీ స్థలాలు చూపించలేదని, పెన్షన్ ఇప్పించాలని, కాలువలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు నిరంతరం లబ్ధిదారులకు అందాలంటే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ప్రజల కోసం చెప్పిన సమయానికి ఠంచనుగా సంక్షేమపథకాలు అమలుచేస్తోంటే, ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రజలకు మంచి జరుగుతుంటే ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు మనస్సు అంగీకరించడం లేదని, ప్రజలను రెచ్చగొట్టేందుకే ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రచరిత్రలోనే ఇప్పటివరకు పేదల బాగోగులు పట్టించుకున్న ప్రభుత్వం, వారి అభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలుచేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. మంచి కలకాలం మనకు అందాలంటే మళ్లీ మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నిండుమనస్సుతో జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఏఈ స్నేహప్రియ, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, ఎం.వి.రమణ, వసీం, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు శీలంరమేష్, దండురామాంజులు, బండిమనోహర్, జి.వెంకటేశ్వర్లు, మునిశేఖర్, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, చందూరెడ్డి, సదాశివరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, జాన్‌బాబు, ఎల్ఐసీ.సుధాకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు



బోరు తవ్వకం ప్రారంభిస్తున్న బ్రాహ్మణ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కలికిరి : కలికిరి పట్టణ పరిధిలోని బ్రాహ్మణ, ఆర్యవైశ్యుల స్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టారు. పట్టణంలోని బ్రాహ్మణులు, ఆర్యవైశ్యులు ఇటీవల రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. వినతిని పరిశీలించిన వారు అభివృద్ధి పనులు మంజూరు చేశారు. ఈ మేరకు గురువారం స్మశాన వాటికలో నూతన బోరు తవ్వకం ప్రారంభించారు. అలాగే మోటారుకు నిధులు మంజూరు చేశారు. దీంతో పట్టణంలో బ్రాహ్మణులు, ఆర్యవైశ్యుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు అజయ్ కుమార్, గ్రామ సచివాలయాల కన్వీనర్ రెడ్డెప్ప, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సుందరరాజులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



కొత్తవాండ్లపల్లెలో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పెద్దమండ్యం : మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని వెలిగల్లు గ్రామంలో గురువారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిధిలోని వెలిగల్లు బీసీ కాలనీ, కొత్తవాండ్లపల్లె, వెలిగల్లు, నడింబురుజు, నడింబురుజు హరిజనవాడ, చాపలతురకపల్లెల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళలను అడిగి తెలుసుకొన్నారు. మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ పథకాల ద్వారా నేరుగా ఖాతాలకే ప్రభుత్వం ప్రతి ఏటా అందిస్తున్నట్లు ఎంపీపీ వివరించారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రాబోయే ఎన్నికలలో తిరిగి సీఎం గా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, సర్పంచ్ సీ సరస్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, శ్రీనివాసులు, వీఆర్‌వో నీలిమ, పంచాయతీ కార్యదర్శి శైలజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు



మొండివానితోపు వద్ద చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

రామసముద్రం : చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటంతో రైతులు ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని కుదురుచీమనపల్లె మొండివాని తోపు సమీపంలో పి.రామచంద్రారెడ్డి పొలం వద్ద 33/11 కేవీ విద్యుత్ వైర్లు ఉన్నాయి. అయితే ఆ తీగలు పొలంలోని చేతికి అంతే ఎత్తులో వేళాడుతుండటంతో రైతులు వ్యవసాయ పనులు చేసుకోవడానికి బయపడుతున్నారు. అంతేకాకుండా పంట పొలాలు, మొక్కజొన్న, టమాటా తదితర తీగజాతి పంటలు సాగు చేయాలంటే విద్యుత్ తీగలు అందే స్థాయి పంట ఏపుగా పెరగడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ తీగలు పైకి లాగాలని రైతులు కోరుతున్నారు.

ఎయిడ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్

పీలేరు : సమష్టి కృషితో ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. గురువారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని పీలేరు మండల సమాఖ్య భవనంలో సంఘమిత్రలకు ఎయిడ్స్ రహిత సమాజంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ గూర్చి ఆందోళన వద్దని, నిర్మూలనకు మెరుగైన అవగాహన అవసరమన్నారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది ?, ఎలా రాదు ? అనే ప్రాథమిక చర్చ జరగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎన్‌ఎం విజయకుమారి, సీహెచ్‌వో ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

వృక్షాల ఆదాయం రూ.17.87 లక్షలు

బి.కొత్తకోట : ముంబై-చెన్నై జాతీయ రహదారి పనుల విస్తరణలో భాగంగా తొలగించిన వృక్షాల ద్వారా రూ.17.87 లక్షల ఆదాయం వచ్చిందని ఎన్‌హెచ్ ఏఈ పి.మధుసూదన్ గురువారం తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో బి.కొత్తకోట, కురబలకోట, ములకలచెరువు మండలాల్లో రోడ్డుకు ఇరువైపులా 1,211 వృక్షాలు ఉండగా అటవీశాఖ వాటికి రూ.17.87 లక్షల విలువ కట్టిందని తెలిపారు. వీటిని రోడ్డు విస్తరణ చేపట్టిన కాంట్రాక్టు సంస్థ డబ్బు చెల్లించి తొలగించిందని తెలిపారు. రోడ్డు పనులు పూర్తయ్యాక కాంట్రాక్టు సంస్థ రోడ్డుకు ఇరువైపులా తొలగించిన వృక్షాల సంఖ్యకు రెండురెట్లు అదనంగా 3,633 మొక్కలను నాటి సంరక్షిస్తారని తెలిపారు. రహదారి విస్తరణ పనులు పదిశాతం పూర్తయినట్టు తెలిపారు.

రూ.12 కోట్లతో బ్రిడ్జిల నిర్మాణం

బి.కొత్తకోట: బి.కొత్తకోట, పీటీఎం మండలాల్లో రెండుచోట్ల రూ.12 కోట్లతో బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నట్టు ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాసులయ్య తెలిపారు గురువారం ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట-బీరంగిరోడ్డులోని కంబాలపల్లె వద్ద ఆలేరువాగుపై రూ.5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం, పెద్దతిప్పసముద్రం మండలంలో పాపాఘ్ని నదిపై రూ.7 కోట్లతో బ్రిడ్జిలు నిర్మించేందుకు నిధులు మంజూరవగా డిజైన్ల తయారీ పనులు సాగుతున్నాయని చెప్పారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో రాకపోకలకు శాశ్వతంగా ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. బి.కొత్తకోట-బడికాయలపల్లె 8.3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.40 కోట్లతో, మద్దయ్యగారిపల్లె-కందుకూరు రోడ్డు పనులకు రూ.కోటితో ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. రూ.23 కోట్లతో చేపట్టిన బి.కొత్తకోట-స్టేట్‌బార్డర్ రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ పనుల్లో 23 కల్వర్టుల నిర్మాణం పూర్తవగా నాలుగు కిలోమీటర్లు మెటలింగ్ పూర్తయ్యిందని, మరో నాలుగు కిలోమీటర్ల మెటలింగ్, ఒక కిలోమీటర్ సిమెంటురోడ్డు పనులు చేపట్టాల్సివుందని చెప్పారు.

ప్రారంభమైన టెన్నిస్‌బాల్ టోర్నమెంట్

నందలూరు(రాజంపేట) : నందలూరు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో గురువారం ప్రీమియర్ లీగ్ సీజన్-7 ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. తొలిరోజు పోటీలు పోటాపోటీగా జరిగాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి, జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యుడు షబ్బీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అరిగె మణి, బీజేపీ నాయకుడు మస్తానయ్య, బీసీ నాయకుడు బూదేల ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ఆర్గనైజర్ ముమ్మడిశెట్టి సుధాకర్, నిర్వాహకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

• చూడచక్కని సూర్యబింబాలు



రామసముద్రం మండలం గొల్లపల్లెచెరువులో సూర్యుని ప్రతిబింబాలు

ప్రకృతికి కాదేదీ కనువిందు ఆశ్చర్యం. ప్రతి నిత్యం చూపరులను ఆశ్చర్యపరిచే సన్నివేశాలు కోకొల్లలు. ఇలాంటి సన్నివేశం గురువారం రామసముద్రం మండలం గొల్లపల్లె చెరువులో కనిపించింది. ఎర్రటి సూర్యుడు సాయంత్రం 6.30 గంట ప్రాంతంలో సూర్యాస్తమయంలో చెరువులో ఎర్రటి రంగులో మూడు సూర్యబింబాలు, సూర్యకిరణాలు కనువిందు చేశాయి. ఆటుగా వెళుతున్న బాటసారులు, రైతులు చూసి మన చెరువులో సూర్యుడు మూడు ప్రాంతాల్లో ముగ్గురు సూర్యుని వలే ప్రతిబింబాలు భలే ఉన్నాయంటూ ఆనందంతో ఆస్వాధించారు. సూర్యకిరణాలు ఆకాశం నుంచి బాణాల వలే చొచ్చుకుని వచ్చి చెరువు నీటిపై పడిన తీరు మూడు అడ్డనామాలు వలే కనిపించాయి.

– రామసముద్రం

డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన



డంపింగ్ యార్డుకు స్థలం పరిశీలిస్తున్న నాయకులు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీకి సంబంధించి డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన చేశారు. గురువారం పీలేరు శివారు ప్రాంతం గూడరేవుపల్లె పంచాయతీలోని గుట్ట ప్రాంతాన్ని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పట్టణంలో సేకరించిన చెత్తాచెదారం డంపింగ్ చేయడానికి ఇబ్బందులు ఎదురవుతోందన్నారు. దీంతో దాదాపు 20 ఎకరాల అనువైన స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. నాయకులు మగ్బుల్‌బాషా, చంద్రారెడ్డి, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

నవోదయలో ఖాళీల భర్తీకి ప్రవేశ పరీక్ష

రాజంపేట : జూలై 22న జవహర్ నవోదయ విద్యాలయం(నారంరాజపల్లె, ఆకేపాడు, రాజంపేట)లో 11వ తరగతి (2023 - 2024)లో ఏర్పడిన ఖాళీల భర్తీకి ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.గీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాల(ప్రభుత్వంచే గుర్తింపుబడిన)లో 2022- 2023 సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి ప్రవేశపరీక్షకు దరఖాస్తులను కోరుతున్నామన్నారు. తమ దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. ఈనెల 31 లోపు దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు.

ఘనంగా నాగదేవత విగ్రహాల ప్రాణప్రతిష్ట



నూతనంగా ప్రాణప్రతిష్ట చేసిన నాగ దేవత విగ్రహాలు

నిమ్మనపల్లె : మండలంలోని తవళం శ్రీ నేమల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం నాగదేవత విగ్రహాల ప్రాణప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు చెందిన శంకారపు మంజుల, భాస్కర్ దంపతులు నాగదేవత విగ్రహాలను ఆలయానికి విరాళంగా అందజేశారు. కత్తిరివారిపల్లెకు చెందిన ఆలయ పురోహితులు శంకర శర్మ, లక్ష్మణస్వామిల ఆధ్వర్యంలో ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు, నిర్వహణ అనంతరం ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పూర్తి చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున్న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్

రామసముద్రం : రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 15 నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ డి.మురళీధర్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించేందుకు జూన్ 16వ తేదీ చివరి గడువుగా తెలిపారు. కళాశాలలో ఇంగ్లీషు, తెలుగు మీడియంలతో సీఈసీ, ఎంపీసీ, బైసీపీ, ఎంఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఈ నెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు, ఇంప్రూమెంట్ రాయబోవు విద్యార్థులకు అధ్యయన తరగతులు ఈనెల 20వ తేదీ వరకు కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

అవకాశాన్ని ఫెయిలైన విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. అలాగే జూన్ 1వ తేదీ నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి బోధన తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఆర్‌బీకే సేవలను వినియోగించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగప్రసాద్

మదనపల్లె : రైతులకు మేలు చేసేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకే సేవలను వినియోగించుకోవాలని ఏఓ నాగప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వర్‌ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని కొత్తపల్లె, అంకిశెట్టిపల్లె, కొండామ్రిపల్లె పంచాయతీల్లో వ్యవసాయ, ఉద్యానశాఖ సేవలపై సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు, వలంటీర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

ఖరీఫ్-2023కు వేరుశెనగ విత్తన పంపిణీపై తెలిపారు. ఈ-క్రాప్ నమోదు, పీఎం-కిసాన్, ఈకేవైసీ ప్రాధాన్యతను రైతులకు వివరించారు. కస్టమ్‌హైరింగ్ సెంటర్ యంత్ర పరికరాలను వినియోగించుకోవాలన్నారు. ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ, మైనారిటీ సామాజికవర్గానికి చెందిన కౌలురైతులకు 11 నెలలకు క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్(సీసీఆర్‌సీ) ఇవ్వనున్నట్లు తెలిపారు. సచివాలయపరిధిలోని అన్ని ఆర్‌బీకేలలో రాయితీ ధరలకు ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్ర భుత్వం అనేక పథకాలను అమలుచేస్తోందని, డ్రిప్ ఇరిగేషన్, ఫామ్‌పాండ్స్, ఆక్వా,మల్బరీ కల్చర్ తది తరాలు, రాయితీలపై వివరించారు. కార్యక్రమంలో సచివాలయ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఊటీకి సమ్మర్ స్పెషల్ యాత్ర బస్సు



ప్రచారం చేస్తున్న మార్కెటింగ్ టీమ్ సభ్యులు

పీలేరు రూరల్ : ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు పీలేరు నుంచి ఊటీకి సమ్మర్ స్పెషల్ యాత్ర బస్సు నడుపుతున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. గురువారం కరపత్రాలు పంపిణీ చేసి యాత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఎం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు నుంచి ఊటీ, కొడైకెనాల్, మున్నార్‌కు ప్రత్యేక బస్సును నుడుపుతున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యాత్రికులు తమ సీటును రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. టికెట్ ధర రూ. 3 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. అక్కడ పర్యాటక ప్రాంతాలను చూపించడం జరుగుతుందని చెప్పారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, సద్వినయోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ టీమ్ కె.వి. రమణ, ప్రమీల పాల్గొన్నారు.

పదివేల మొక్కలు ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పీలేరు గ్రామ పంచాయతీకి పది వేల మొక్కలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విన్నవించారు. గురువారం సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా మంత్రికి వినతిపత్రం అందజేశారు. పీలేరు పట్టణాన్ని పచ్చదనంతో నింపడానికి సంకల్పించామని, అందుకు తగినన్ని మొక్కలు కావాలని మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి మొక్కలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబరు విక్టరీ వెంకటరమణారెడ్డి, నాగభూషణం, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ కేవీపల్లె మండల యువజన విభాగం కన్వీనర్ గజ్జెల శీనరెడ్డి, నాయకులు రామకొండారెడ్డి మంత్రిని కలసి పలు సమస్యలపై విన్నవించారు.

పెరటి తోటలతో అధిక ఆదాయం



అంతర పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరి

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయంలో పెరటి తోటలు వేడయం వలన అధిక ఆదాయం పొందవచ్చునని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లిలో పార్వతమ్మ, ఉష సాగు చేసిన పెరటి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుకు నిరంతరం ఆదాయం వచ్చే విధంగా అంతర పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం పూర్తిస్థాయిలో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నవీన్ కుమార్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వాతి, శ్రీనివాసులు, పెద్ద రెడ్డెయ్య, రెడ్డిబాష, హేమలత, హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.